



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయి

# సిఎం సారూ.. కష్టాలు కనరా..

## - జిల్లాలో ప్రాజెక్టులకు పడని అడుగులు - నేడు జిల్లాలో సిఎం పర్యటన

**ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి**

కర్నూలు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు అడుగులు ఇటుకంతైనా పడటం లేదు. దీంతో కరవు, వలసలు ఆగడం లేదు. దానికి తోడు జిల్లాలో సమస్యలు కూడా తీవ్ర స్థాయిలో ఉన్నాయి. గురువారం ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఎమ్మిగనూరులో పర్యటించనున్నారు. బటన్ నొక్కి జగనన్న చేదోడు సొమ్మును లబ్ధిదారుల ఖాతాలో జమ చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఈ సారైనా జిల్లా వాసుల కష్టాల వైపు చూస్తారేమో అని జిల్లా వాసులు ఆశతో ఎదురుచూస్తున్నారు..

**వలస నివారణ చర్యలు శూన్యం**

ఏళ్లు గడుస్తున్నా జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో వలస వెతలు తప్పడం లేదు. ఉన్న ఊర్లో ఉపాధి లేకపోవడంతో పొట్ట చేతపట్టుకుని ఇతర పట్టణాలకు, నగరాలకు తరలిపోతున్నారు. కోసిగి, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, హొళగుంద, ఆలూరు, కోడుమూరు మండలాల నుంచి ఈ ఏడాది కూడా వలసలు ప్రారంభమయ్యాయి. తెలంగాణ, బెంగళూరు, గుంటూరు, ముంబైలకు తరలివెళ్లారు. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 40వేల మందికి పైగా వలస వెళ్లారు. వలస నివారణకు చర్యలు చేపట్టే అంశాన్ని ఇప్పటి వరకూ ఏ బడ్జెట్‌లో ప్రస్తావించలేదు.

**వసతులు లేని కొత్త డివిజన్...**

జిల్లా విభజన తరువాత పత్తికొండ రెవెన్యూ డివిజన్ కొత్తగా ఏర్పడింది. ఈ ప్రాంతంలోని రెవెన్యూ పరమైన సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని ఈ ప్రాంత రైతులు, ప్రజలు ఎన్నో కలలుగన్నారు. డివిజన్ ఏర్పాటై ఏడాది పూర్తయింది. నేటికీ సమస్యలు పరిష్కారం కాలేదు. ఆర్‌డిఒ కార్యాలయానికి సొంత భవనం నిర్మించేందుకు అవసరమైన నిధులు కూడా సమకూరలేదు. తహశీల్దారు కార్యాలయంలోనే రెవెన్యూ డివిజన్ కార్యాలయం ఏర్పాటు చేసి అక్కడి తహశీల్దారు కార్యాలయాన్ని వందేళ్ల నాటి పాత భవనంలోకి మార్చారు. 2022 ఏప్రిల్ 4న ఆదోని డివిజన్ నుంచి విడిపోయి కొత్తగా ఏర్పాటైన పత్తికొండ డివిజన్లో పత్తికొండ నియోజకవర్గంలోని నాలుగు, ఆలూరు నియోజకవర్గంలోని ఐదు మండలాలతో కలిసి కొత్తగా పత్తికొండ డివిజన్ ఏర్పడింది.

**గతి లేని గుండ్రేవుల**

కర్నూలు, కడప జిల్లాలకు మేలు కలిగిలే రూపొందించిన గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన చర్యలేవీ ఇప్పటి వరకూ మొదలు కాలేదు. కర్నూలు జిల్లా సుంకేసుల దగ్గర తుంగభద్ర నదిపై 1.20 టిఎంసిల సామర్థ్యంతో 1865లో అప్పటి పాలకులు సుంకేసుల జలాశయాన్ని నిర్మించారు. ఈ బ్యారేజీకి అనుసంధానంగా కర్నూలు-కడప (కెసి) కాలువ నిర్మించారు. జల రవాణా కోసం నిర్మించిన కాలువను స్వాతంత్ర్యం అనంతరం సాగునీటి కాలువగా మార్చారు. కృష్ణా వాటర్ డిస్ప్యూట్ ట్రిబ్యూనల్ 31.90 టిఎంసిల నీటి వాటాను కేటాయించింది. దీని పరిధిలో కర్నూలు, కడప జిల్లాలో 2.65 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. సుంకేసుల సామర్థ్యం తక్కువ కావడంతో తుంగభద్రకు వరదవస్తేనే కాలువకు సాగునీరు అందుతోంది. ఈ సమస్యను అధిగమించేందుకు సాగునీటి నిపుణులు, విశ్రాంత ఇంజనీర్ సుబ్బరాయుడు సుంకేసుల రిజర్వాయర్ ఎగువన గుండ్రేవుల జలాశయం నిర్మాణానికి రూపకల్పన చేశారు. కర్నూలు జిల్లాలోని సి.బెళగల్, నందవరం, తెలంగాణలోని రాజోలి ప్రాంతాల్లో ఈ ప్రాజెక్టును నిర్మించేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. గుండ్రేవుల జలాశయం నిర్మాణం జరిగితే 20 టిఎంసిలు నిల్వ చేయనున్నారు. వరద లేని సమయంలోనూ ఈ నీటిని వాడుకోవచ్చు. గుండ్రేవులకు సంబంధించి గత ప్రభుత్వం లాగే ఈ ప్రభుత్వం కూడా శ్రద్ధ పెట్టడం లేదు. వైసిపి ప్రభుత్వం వచ్చాకా ప్రవేశపెట్టిన రెండు బడ్జెట్‌లలోనూ గుండ్రేవులకు నిధులు కేటాయించకపోవడంతో జిల్లా ప్రజల ఆశలు అడిఆశలయ్యాయి.

**ఉత్తిపోతలుగానే వేదవతి ఎత్తిపోతలు**

కరవుకు నిలయమైన ఆలూరు ప్రాంతంలో పొలాలు పచ్చబడాలన్న ఉద్దేశంతో వేదవతి నది పరిధిలో నిర్మించిన ఎత్తిపోతలు ఉత్తిపోతలుగా మారాయి. వేదవతి నది పరిధిలో అమృతాపురం, జె.హొసళ్లి , సిద్ధాపురం వద్ద మూడు ఎత్తిపోతల పథకాలు నిర్మించారు. 2008 లో మంత్రి మారెప్ప హయాంలో వీటిని చేపట్టారు. నిర్వహణలో లోపాలు అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో పథకాలు ఏడాదికే నిరుపయోగంగా మారాయి. పథకం ప్రారంభంలో వేసిన గొట్టాలు దెబ్బతిన్నాయి. ఒక్కో ఎత్తిపోతల కింద 500 నుంచి 600 ఎకరాల ఆయకట్టు ఉంది. మరమ్మతులకు నిధులు వెచ్చించి పునరుద్ధరిస్తే తామే వాటిని కొనసాగించుకుంటామని రైతులు వేడుకుంటున్నా పట్టించుకొనేవారు కరువయ్యారు.

**టెక్స్‌టైల్ పార్కు భూకేటాయింపుకే పరిమితం**

ఎమ్మిగనూరు తాలూకా పరిధిలో ఆరు వేలకు పైగా కుటుంబాలు చేనేత వృత్తిపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నాయి. అలాంటి వారిని ఆదుకోవాల్సిన పాలక ప్రభుత్వాలు కంటి తుడుపు చర్యగా వారికి ఆర్థిక సాయం పేరుతో మంజూరు చేస్తున్నాయి. పూర్తిస్థాయి సమస్యల పరిష్కా రానికి దృష్టి సారించడం లేదు. గత ప్రభుత్వ హ యాంలో బనవాసి కేంద్రంలో 96.5 ఎకరాలకు పైగా టెక్స్‌టైల్ పార్కులకు కేటాయించారు. ఇప్పటివరకు టెక్స్‌టైల్ పార్కు అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఈ ప్రాంతం చుట్టూ ఉన్న స్పిన్నింగ్ మిల్లులు మూత పడ్డాయి. చేనేత సహకార సొసైటీ కూడా ప్రభుత్వం నుండి ఎలాంటి తోడ్పాటు లేకపోవడంతో ఉత్సవ విగ్రహం లాగా తయారయింది.



ఏర్పాట్లపై చర్చిస్తున్న అధికారులు

## ముఖ్యమంత్రి సభకు సర్వం సిద్ధం..

**- నేడు ఎమ్మిగనూరుకు జగన్ రాక**

**- ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు, ప్రజాప్రతినిధులు**

**ఎమ్మిగనూరు :** ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నేడు తాడేపల్లిగూడెం ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి కర్నూలు జిల్లా ఎమ్మిగనూరుకు చేరుకోనున్నారు. ఉదయం 8.30 గంటలకు తాడేపల్లిగూడెం హెలిప్యాడ్ ప్రాంతానికి చేరుకొని తన కాన్వాయి ద్వారా 10 గంటలకు సభ ప్రాంగణానికి చేరుకుంటారు. అనంతరం సభా వేదికపై 'జగనన్న చేదోడు'పై ప్రసంగిస్తారు. సభ, సభా ప్రాంగణం చుట్టూ జిల్లా అధికారులతో పాటు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పరిశీలించారు. ఏర్పాట్లను బీసీ సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.అనంత రామ్, కలెక్టర్ డాక్టర్ సృజన, జెసి నారపురెడ్డి మౌర్య, సమన్వయకర్త తలశిల రఘురాం, సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ పరిశీలించారు. అలాగే జడ్‌పి ఛైర్మన్ పాపిరెడ్డి, అనంతపురం డిఐజి అమ్మిరెడ్డి, కర్నూలు ఎస్పీ జి.కృష్ణకాంత్ వేర్వేరుగా పరిశీలించారు.

## 'ప్రజారక్షణ భేరి'ని జయప్రదం చేయండి

**- సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయి**

**ప్రజాశక్తి కర్నూలు కార్పొరేషన్**

రాష్ట్రంలో ప్రత్యామ్నాయ రాజకీయ విధానాలతో రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం, రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాలని కోరుతూ సిపిఎం రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా రక్షణ భేరి పేరుతో చేపట్టిన బస్సు యాత్ర అక్టోబర్ 30 తేదీన ఆదోని నుండి ప్రారంభమవుతుందని, ఈ బస్సు యాత్రను విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ పిలుపునిచ్చారు. బుధవారం సిపిఎం ఓల్డ్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణ మండపంలో విజయ్ అధ్యక్షత జరిగిన సిపిఎం నగర విస్తృత సమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి పరిపాలన వచ్చిన తర్వాత రాష్ట్ర అభివృద్ధి గురించి పట్టించుకోవడంలేదని, నిరుద్యోగ సమస్య పరిష్కారం చేయడం లేదని, ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయడం లేదని, వెనక వెనకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించడంలో వైఫల్యం చెందిందని విమర్శించారు. కర్నూలు జిల్లా అభివృద్ధికి సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి పైసా కేటాయించకుండా జిల్లాలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పర్యటన చేయడం బాధ్యత రాహిత్యమని ఆయన ఘాటుగా విమర్శించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా తీసుకుని వస్తాను, బిజెపి మెడలు వంచి వెనకబడిన ప్రాంతాలకు నిధులు సాధిస్తామని చెప్పిన ముఖ్యమంత్రి నాలుగేళ్లలో బిజెపికి వ్యతిరేకంగా ఒక్క మాట మాట్లాడక పోవడం ఆయన చేతగాని తనానికి నిదర్శనమని విమర్శించారు. బిజెపి రాయలసీమ డిక్లరేషన్ పేరుతో రాయల సీమ ప్రజలను మోసం చేయడం తప్ప రాయలసీమ అభివృద్ధి కి, కర్నూలు జిల్లా అభివృద్ధికి ,కేంద్రం నుండి ఒక్క రూపాయి కూడా తీసుకు రాకుండానే ప్రజల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. జిల్లాలో ప్రజలు తాగు, సాగునీటి సమస్యతో చాలా ఇబ్బంది పడుతున్నారని వర్షాలు లేక పంటలు ఎండిపోయాయన్నారు. ఆదుకునే నాథుడే లేదని అన్నారు. జిల్లాలో కరువు చాయలు కనబడుతున్నా కరువు గురించి ఎవరు మాట్లాడటం లేదని ఆయన విమర్శించారు. కర్నూలు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని కోరారు. నగర కార్పొరేషన్ లో వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత నగర అభివృద్ధి గురించి ఏమాత్రం పట్టించు కోవడం లేదన్నారు. నగరంలో ప్రజల తాగునీటి సమస్య పరిష్కారం చేయడంలో చిత్తశుద్ధి ప్రదర్శించడం లేదన్నారు. మరో సమర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తున్నా దాని గురించి పట్టించుకోవడం లేదన్నారు. ప్రజలకు ఉపయోగపడే శాశ్వత సమస్యలు పరిష్కారం చేయకుండా కేవలం రంగులు దిద్దుతూ, లైట్లు వెలిగిస్తూ కాలం గడుపుతున్నారని విమర్శించారు. 30న జిల్లాలో పర్యటించే బస్సు యాత్రలో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి షరీఫ్, అబ్దుల్లా, రామకృష్ణ, నగర నాయకులు రాజగోపాల్, కెవి.సుబ్బయ్య, పార్వతయ్య పాల్గొన్నారు.

## నోటిఫికేషన్లు, ఉపాధిపై సిఎం ప్రకటించాలి : డివైఎఫ్ఐ

**ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్**

కర్నూలు జిల్లా ఎమ్మిగనూరుకు గురువారం వస్తున్న ముఖ్యమంత్రి ఎన్నికల ముందు యువతకు ఇచ్చిన హామీలు రాష్ట్రంలో ఖాళీ పోస్టుల భర్తీ, యువత ఉపాధి కల్పన కోసం కర్నూలు జిల్లాలో పరిశ్రమలపై స్పష్టమైన ప్రకటన చేయాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, నగేష్, జిల్లా ఉపాధ్యక్షులు హుస్సేన్‌బాష, నాయకులు సూర్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కర్నూలు సుందరయ్య భవన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నేను అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2.4 లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు విడుదల చేస్తానని, ప్రతి సంవత్సరం ఖాళీ అయ్యే పోస్టులతో కలిపి జనవరి ఒకటవ తేదీ జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని నిరుద్యోగులకు హామీ ఇచ్చారన్నారు. నాలుగేళ్లు పూర్తయినా ఒక్కసారి మాత్రమే జాబ్ లెస్ జాబ్ క్యాలెండర్ విడుదల చేశారన్నారు. వాటిని కూడా అమలు చేయలేదని అన్నారు. డిఎస్‌సి, గ్రూప్ 2 నోటిఫికేషన్ ఇవ్వని రాష్ట్ర ప్రభుత్వం కనీసం ఇప్పటికైనా గురువారం ఎమ్మిగనూరులో జరిగే బహిరంగ సభలో ప్రభుత్వ నోటిఫికేషన్ లపై ఒక స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. కర్నూల్ జిల్లాలో ప్రతి సంవత్సరం ఆరు లక్షల మంది వలస వెళుతున్నారని, కర్నూలు ఓర్వకల్ పారిశ్రామిక హబ్ ఎమ్మిగనూరు టెక్స్‌టైల్ పార్క్, ఆదోని జిన్నింగ్ ప్రెస్సింగ్ మిల్లులు పత్తికొండ టమోటా జ్యూస్ సాస్ ఫ్యాక్టరీ, కర్నూలు జిల్లాలో ఐటీ ఫార్మా, బిపిఒ కంపెనీలను ఏర్పాటు చేసి జిల్లాలోని యువతకు ఉపాధి కల్పించి వలసలను నివారించాలని కోరారు. వైసిపికి ఇప్పటివరకు కర్నూలు జిల్లా ప్రజానీకం ముఖ్యంగా యువతి తిరుగులేని మెజారిటీ ఇస్తున్నారని అలాంటి జిల్లాకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇప్పటివరకు ఒక పరిశ్రమ, ఒక సాగునీటి ప్రాజెక్టు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ప్రస్తుతం జిల్లాల విభజన తర్వాత అత్యంత వెనుకబడిన జిల్లాగా కర్నూలు ఉందన్నారు. ఇప్పటికైనా ఈ జిల్లాను అభివద్ధి చేయకపోతే రాబోయే కాలంలో తీవ్రమైన కరువును ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. రాబోయే ఎన్నికల్లో కర్నూలు జిల్లా యువత, ప్రజానీకం వైసిపికి బుద్ధి చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

## చేపల వినియోగం ఆరోగ్యానికి మంచిది

**- కలెక్టర్ డాక్టర్ సృజన**

**- కర్నూలులో 'ఫిష్ ఆంధ్ర' రెస్టారెంట్ ప్రారంభం**

**ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్**

పోషక విలువల ఖజానా అయిన చేపలను వినియోగించడం ఆరోగ్యానికి చాలా మంచిదని కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. బుధవారం కర్నూలు నగరంలోని గాయత్రి ఎస్టేట్ ఎదురుగా నెలకొల్పబడిన 'ఫిష్ ఆంధ్ర' సూపర్ రెస్టారెంట్ ప్రారంభమైంది. ఈ రెస్టారెంట్‌ను కలెక్టర్ సృజన, కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్ కుమార్, జెసి నారపురెడ్డి మౌర్య, జిల్లా మత్స్యశాఖ అధికారి శ్యామల పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ఇతర ఆహారాలతో పోలిస్తే చేపల్లో అత్యుత్తమమైన ప్రోటీన్స్ లభిస్తాయని తెలిపారు. జిల్లాలో మత్స్య సంపద అధికంగా ఉందని, వినియోగం పెరిగితే మత్స్యకారులకు లాభదాయకంగా ఉంటుందని వివరించారు.



రెస్టారెంట్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్

## నేడు 'జగనన్న చెదోడు' అందజేత

**- రూ.350.02 కోట్లు విడుదల చేయనున్న సిఎం**

**ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్**

'జగనన్న చేదోడు' నాలుగో విడత ఆర్థిక సహాయం కింద రాష్ట్రవ్యాప్తంగా 3,25,020 మంది అర్హులైన రజక, నాయీ బ్రాహ్మణ, టైలర్‌లు, అక్కాచెల్లెమ్మలకు రూ.325.02 కోట్లను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విడుదల చేయనున్నారు. గురువారం కర్నూలు జిల్లా పర్యటనలో భాగంగా ఎమ్మిగనూరులో జరిగే బహిరంగ సభలో 'జగనన్న చేదోడు' నాలుగో విడత ఆర్థిక సహాయాన్ని ముఖ్యమంత్రి లాంఛనంగా ప్రారంభించనున్నారు. రజకులు, నాయీ బ్రాహ్మణులు, టైలర్లకు ఏటా రూ.10,000 చొప్పున సహాయం అందిస్తున్నారు. 1,80,656 మంది టైలర్లకు ఈ విడత సహాయంగా రూ.180.66 కోట్లు, 39,813 మంది నాయీ బ్రాహ్మణులకు రూ.39.81 కోట్ల లబ్ధి చేకూరుతోంది. 1,04,551 మంది రజకులకు ఈ విడత సహాయంగా రూ.104.55 కోట్ల లబ్ధి అందించనున్నారు.

## సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి నిధులివ్వాలి

**కరువు జిల్లాగా ప్రకటించాలి : ముఖ్యమంత్రికి సిపిఎం సూచన**

**ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్**

కర్నూలు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం కోసం ముఖ్యమంత్రి ఎమ్మిగనూరు పర్యటనకు వస్తున్న సందర్భంగా నిధులు విడుదల చేస్తూ ప్రకటన చేయాలని, కర్నూలు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇస్తానని, కర్నూలు జిల్లా ప్రాజెక్టుల నిర్మాణం కోసం నిధులు కేటాయిస్తానని చెప్పి నాలుగున్నరేళ్లు గడిచినా ఒక్క రూపాయి కూడా కేటాయించకుండా కాలయాపన చేయడం సరైన పద్ధతి కాదన్నారు. ఎమ్మిగనూరు పర్యటనలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం కోసం నిధులు కేటాయిస్తూ ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మిగనూరులో టెక్స్ టైల్ పార్క్ ఏర్పాటు చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో వర్ష భావ పరిస్థితి వల్ల రైతులు వేసిన పంటలనే దెబ్బతిన్నాయని, ఏ మండలంలో కూడా ఒక్క ఎకరా కూడా సరియైన పంటలు రాకా,రైతులు తీవ్రంగా నష్టపోయారని, ఒక ఎకరాకు రూ.30 వేల నష్టపరాహారం ఇచ్చేందుకు ప్రకటన చేయాలని, కర్నూలు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

## చంద్రబాబు అరెస్టుకు నిరసనగా జలదీక్ష

**ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్**



సంకల్‌బాగ్ వద్ద తుంగభద్రలో జలదీక్ష

తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ కర్నూలు టిడిపి ఇన్‌ఛార్జి టిజి భరత్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు జల దీక్ష కార్యక్రమం చేపట్టారు. బుధవారం నగరంలోని సంకల్ బాగ్ లోని దుర్గాఘాట్ వద్ద జల దీక్ష చేపట్టారు. నేతలందరూ నీటిలోకి దిగి చంద్రబాబుకు మద్దతుగా ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేశారు. నాయకులు మాట్లాడుతూ ఎలాంటి ఆధారాలు లేకుండా చంద్రబాబును అరెస్టు చేయడం దుర్మార్గమని అన్నారు. చంద్రబాబుకు మద్దతుగా రాష్ట్ర ప్రజలందరూ ఉన్నారన్నారు.నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్, నేతలు గున్నామార్క్, సుంకన్న, రామాంజనేయులు, తిమ్మోజీ, తిరుపాల్ బాబు, ఏసు, రాజశేఖర్ రెడ్డి, పాల్ రాజ్, చిన్నమ్మ, సుశీలమ్మ, టిఎన్ఎస్ఎఫ్, ఐటిడిపి నేతలు పాల్గొన్నారు.

## గుండెపోటుతో వేర్వేరు చోట్ల ఇద్దరు మృతి

**-వరుస ఆకస్మిక మరణాలతో సి బెళగల్ బేంబేలు**

**-ఈ నెలలో 8కి చేరిన మరణాలు**

**ప్రజాశక్తి- సి బెళగల్ :** సి బెళగల్ మండలం చింతమానుపల్లె తెలుగు వెంకట్రాముడు (58), సి.బెళగల్‌కు చెందిన పెమెర దుబ్బన్న (48) తెలంగాణలో పత్తి సుగ్గికని వెళ్లి బుధవారం గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. ఇదే నెలలో మండలంలో సాధారణ మరణాల కంటే అసాధారణ మరణాలు కలచివేస్తున్నాయి.1 న బెళగల్ ఆసుపత్రిలో పని చేస్తున్న జమ్మన్న (39),4 న ముడుమాలలో యశోద (25), అక్కడే పేతురు (35),6 న వెలుగు సీసీ నాగేంద్ర (39),15 న పోలకల్ లో టీడీపీ నాయకులు గుండన్న (47)బురాన్ దొడ్డిలో ఒకరు ,16 న ఈర్లదిన్నెలో టిడిపి నాయకురాలు ముంతక్క (55), బుధవారం బెళగల్‌లో దుబ్బన్న, చింతమాను పల్లెలో టిడిపి నాయకులు తెలుగు వెంకట్రాముడు (58) ఇలా వరుస మరణాలతో మండలంలో ప్రజలు బేంబేలెత్తిపోతున్నారు.

## ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

**అనంతపురం రేంజీ డిఐజి , కర్నూలు ఎస్‌పి**

**ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్**



మాట్లాడుతున్న అనంతపురం రేంజీ డిఐజి , వేదికపై కర్నూలు ఎస్‌పి

ఈనెల 19న జగనన్న చేదోడు నాలుగవ విడత నగదు పంపిణీలో భాగంగా కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు పట్టణానికి ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్ రెడ్డి రాక సందర్భంగా జిల్లా పోలీసు యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లను చేపట్టిందని అనంతపురం రేంజ్ డిఐజి ఆర్ఎన్.అమ్మి రెడ్డి జిల్లా ఎస్పి జి. కృష్ణకాంత్ బుధవారం తెలిపారు. ఎమ్మిగనూరు డిస్‌పి కార్యాలయంలో ముఖ్యమంత్రి పర్యటన నిమిత్తం బందోబస్తుకు విచ్చేసిన పోలీసు అధికారులకు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సెక్టార్ ఇంచార్జ్ అధికారులకు బ్రీఫింగ్ చేసి పలు సూచనలు, సలహాలు జాగ్రతల గురించి తెలిపారు. పోలీసులు అప్రమత్తంగా ఉండి , పకడ్బందీ భద్రతో విధులు నిర్వహించాలన్నారు. కేటాయించిన విధులలో పూర్తి బాధ్యతగా, ఎటువంటి రిమార్కులు లేకుండా పని చేయాలన్నారు. బహిరంగ సభ ప్రవేశ, నిష్క్రమణల దగ్గర యాక్సెస్ కంట్రోల్ వారు పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు.విధుల పట్ల అలసత్వం వహించరాదన్నారు. హెలిప్యాడ్, బహిరంగ సభ, బ్యారికేడింగ్, పార్కింగ్ ప్రదేశాలు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ , ఇతర భద్రత ఏర్పాట్ల గురించి కర్నూలు ఇంచార్జ్ అనంతపురం రేంజ్ డీఐజీ ఆర్.ఎన్ అమ్మి రెడ్డి జిల్లా జి. కృష్ణ కాంత్ పరిశీలించారు. బందోబస్తు విధులు నిర్వహించే పోలీసులు, స్పెషల్ పార్టీ పోలీసు బృదాలు , పోలీసు జాగీలాలు, బాంబ్ స్క్వాడ్ బృందాలు, సెక్టార్ ఇంచార్జ్ అధికారులు , రూట్ బందోబస్తు ఆఫీసర్లు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ ఉన్నతాధికారులకు సమాచారం అందించాలన్నారు. సమావేశంలో కర్నూలు, నంద్యాల ,కడప , అనంతపురం, అన్నమయ్య, శ్రీ సత్య సాయి, చిత్తూరు జిల్లాలకు చెందిన అడిషనల్ ఎస్‌పిలు, డిఎస్‌పిలు, సిఐలు , ఎస్ఐలు ఉన్నారు.



## టిడిపిలో చేరిన వైసిపి నాయకులు

**పార్టీలోకి ఆహ్వానించిన గౌరు దంపతులు**

**ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ :** వైసిపి నాయకులు సర్పంచులు సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు సిద్ధారెడ్డి శ్రీధర్ రెడ్డి, డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక ముఖ్య అనుచరులు పెద్దపాడు గ్రామ వైసిపి ముఖ్య నాయకులు చిన్న బీచుపల్లీ , ఏడు కుటుంబాలు గౌరు దంపతుల సమక్షంలో బుధవారం టిడిపిలో చేరాయి. ఎద్దపాడులో టిడిపి నూతన కార్యాలయాన్ని ప్రారంభించి వైసిపికి చెందిన శ్రీధర్ రెడ్డి ముఖ్య అనుచరుడు చిన్న బీచుపల్లి, వార్డ్ ఇంచార్జి రెడ్డి తిరుమలేశ్వర్ రెడ్డి గౌరు దంపతుల సమక్షంలో టిడిపిలో చేరారు. వారిని టిడిపి సీనియర్ నాయకులు గౌరు వెంకటరెడ్డి, గౌరు చరిత టిడిపి కండువా కప్పి ఆహ్వానించారు. పెద్దపాడు రెడ్డిగారి చంద్ర కళాధర్ రెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ పెరుగు పురుషోత్తం రెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులు బ్రహ్మణ పల్లె నాగిరెడ్డి, కె బీచుపల్లి, కల్లూరు మండలం అధ్యక్షుడు డి.రామాంజనేయులు, మాదన్న, కల్లూరు మాదేష్, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు జవ్వాజి గంగాధర్ గౌడ్, అర్బన్ నాయకులు రెడ్డిగారి లోకేశ్వర రెడ్డి, ధనుంజయ పాల్గొన్నారు.

## కర్నూలును కరువు జిల్లాగా ప్రకటించాలి

**వ్యకాసం, ఎపి రైతు సంఘం వేర్వేలు ప్రకటనలో డిమాండ్ .**

**ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్**

కర్నూలును కరువు జిల్లాగా ప్రకటించి , ఉపాధి పనులు చూపి వలసలను నివారించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, బి.వీరశేఖర్, కెవి. నారాయణ, ఎపి రైతుసంఘం అధ్యక్ష కార్య దర్శులు వెంకటేశులు, జి.రామకృష్ణ వేర్వేరు ప్రకటనలో డిమాండ్ చేశారు. కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతం సాగునీటి ప్రాజెక్టులు లేక, వర్షాలు కురవక, వ్యవ సాయ పనులు లేక గ్రామీణ పేదలు సు దూర ప్రాంతాలకు వలసలు పోతున్నా రని, పొట్ట చేత పట్టుకొని పట్టెడన్నం కోసం, పిల్లపాపల్ని వెంట వేసుకొని వల సలు వెళ్లాల్సి వస్తుందన్నారు.

వల సలకు వెళ్లి సందర్భంగా ప్రమాదాలకు గురై ప్రాణాలు కూడా కోల్పోతు న్నార న్నారు. ముఖ్యమంత్రి ఎమ్మిగనూరు పర్య టనకు వస్తున్న సందర్భంగా ఈ ప్రాంత పేదల గురించి ఆలోచించాలని కోరారు. పేదల పట్ల ప్రజల పట్ల నిజమైన ప్రేమ ఉన్న ముఖ్యమంత్రి ప్రతి వ్యవసాయ కూలీ కుటుంబానికి కరువు భృతి కింద రూ.20 వేల ఇవ్వాలని, ప్రతి కుటుంబానికి 200 రోజులు పని దినాలు, రోజు వేతనం రూ.600 ఇవ్వాలన్నారు. ప్రతి పేద కుటుంబానికి ప్రజా పంపిణీ ద్వారా 14 రకాల నిత్యవసర వస్తువులు ఆరు నెలల పాటు అందించాలన్నారు. ఇప్పటికే బీదలు సాగు చేసుకుంటున్న భూములకు అసైన్మెంట్ కమిటీలు వేసి భూ పంపిణీ చేపట్టాలన్నారు. పేదల గుడిసెలు వేసు కొని నివసిస్తున్న ప్రాంతాల్లో వారికి పట్టాలు మంజూరు చేసి పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని కోరారు. ముఖ్యమంత్రి వ్యవసాయ కూలీలు పేదల గోడు వినాలని, జిల్లా ప్రజలను ఆదుకునే కార్యక్రమం చేయాలని విజ్ఞప్తి చేశారు. రైతులు వేసిన పంటలు వేసి పంటలు ఎండిపోయాయని, 60 శాతం కూడా సాగుకు నోచుకోలేదని పేర్కొన్నారు. ఎండిపోయిన పంటలకు ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు



ప్రదర్శన చేస్తున్న బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులు

## యుద్ధ వద్దు శాంతి నెలకొల్పాలి

**ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ :** యుద్ధం వద్దు శాంతిని నెలకొల్పాలని కోరుతూపాలస్తీనా పై దాడులు ఆపి చర్చల ద్వారా వివాదాన్ని పరిష్కరించాలని కోరుతూ బుధవారం వర్కింగ్ బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ , బిఎస్ఎన్ఎల్ ఎఐబిడిపిఎ, బిఎస్ఎన్ఎల్ సిసిడబ్లుఎఫ్ యూనియన్లు సంయుక్తంగా కర్నూల్ ఇ10 బి ఎక్సేంజ్ దగ్గర ప్రదర్శనలు నిర్వహించినట్లు బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ జిల్లా కార్యదర్శి ఎన్.రామరాజు తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఇస్లామిక్ బ్యాంక్ ఏర్పాటు ఏమైంది

**సిఎంకు ఆవాజ్ కమిటీ సూటి ప్రశ్న**

**ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్**

కర్నూ లు జిల్లా పర్యటనకు వస్తున్న సిఎం జగన్మోహన్ రెడ్డి ఇస్లామిక్ బ్యాంక్ ఏర్పాటుపై ప్రకటన చేయాలని ఆవాజ్ కమిటీ నగరఅధ్యక్ష ,కార్యదర్శులు పి.ఇక్బాల్ హుస్సేన్ ,షేక్ మొహమ్మద్ షరీఫ్ డిమాండ్ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గా ఉన్నప్పుడు హైదరాబాద్‌లో అత్యధికంగా ముస్లిం మైనార్టీలు ఉండేవారని విభజన ఆంధ్ర ప్రదేశ్ అనంతరం కర్నూలు జిల్లాలో అత్యధికంగా ముస్లిం మైనార్టీ లు నివసిస్తున్నారని, అటువంటి జిల్లాలో ఇస్లామిక్ బ్యాంక్ ఏర్పాటుపై ప్రకటన చేయాలని కోరారు. సిఎంకు ఏమాత్రం ముస్లిం మైనార్టీల పైన చిత్తశుద్ధి ఉంటే కచ్చితంగా ప్రకటిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ముస్లిం మైనారిటీలు అనేక రంగాలలో వెనుకబడి ఉన్న సంగతి ప్రభుత్వానికి తెలుసనే విషయాన్ని గుర్తు చేశారు. దుల్హన్‌పథకానికి షరతులను తొలగించాలని కోరారు. ముస్లి మైనార్టీల అభివద్ధి కోసం వైసిపి ప్రభుత్వం ఏమేమి సంక్షేమ పథకాలు అమలు చేస్తుందో వివరించాలని కోరారు. లేనిపక్షంలో వైసిపి ప్రభుత్వానికి జగనన్నకు రాజకీయ సమాధి కట్టడానికి ముస్లిం మైనార్టీలతోపాటు ఇతర ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున చైతన్యం చేయిస్తామని హెచ్చరించారు.

## సంఘాలలో ఆరోగ్య సురక్షకు తగ్గిన ప్రజలు

**ప్రజాశక్తి- సి బెళగల్ :** సి బెళగల్ మండలం సంఘాలలో వైద్యులు మిథున్ రెడ్డి, అధికారుల సమక్షంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టారు. పలుకు దొడ్డి, సంఘాల, తిమ్మందొడ్డి పంచాయతీలకు సంబందించి సంఘాలలో ఏర్పాటు చేయడంతో ఆయా గ్రామాల ప్రజలు, రోగులు ఇక్కడికి రావడానికి విముఖత చూపినట్లు తెలిసింది. అందుకే వైద్యశిబిరం చివర రోజు వెలవెల బోయింది.

## బాబు అక్రమాలు చేసి జైలుకు వెళ్లాడు...

**- మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి**

**ప్రజాశక్తి - కౌతాళం**


గ్రామ చావిడిని ప్రారంభిస్తున్న మహంతేశ్వర స్వామి, ఎమ్మెల్యే

మాజీ ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు అవినీతి, అక్రమాలు చేసి జైలుకు వెళ్లారని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పొదలకుంట గ్రామంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బాబును జైలుకు పంపారని టిడిపి నాయకులు ఆరోపించడం అవాస్తవమని తెలిపారు. టిడిపి శ్రేణులు బాబు అక్రమాలను దాచి పెట్టాలని చూస్తున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రజలు అంతా గమనిస్తున్నారని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. అనంతరం రూ.10 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ చావిడిని హాల్వి సిద్దేశ్వర మఠం పీఠాధిపతులు మహంతేశ్వర స్వామి చేతులమీదుగా ప్రారంభించారు. వైసిపి మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లద చారి, ఎంపిపి అమ్రేష్, వైస్ ఎంపిపి బుజ్జిస్వామి, కోఆప్షన్ సభ్యులు మాబు సాబ్, మండల నాయకులు ఏకంరెడ్డి, హాల్వి చెన్నప్ప, బసవ ప్రభు, మర్రి గౌడ్, సుబ్బరాజు, రాఘవేంద్రారెడ్డి, మల్లయ్య, సోమనాథ్, వెంకటేష్ పాల్గొన్నారు.

## 'ఆర్‌డిఎస్'కు నిధులు కేటాయించాలి

**- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు రామాంజనేయులు**

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు**


సమావేశంలో మాట్లాడుతున్న రామాంజనేయులు

జిల్లాలోని పశ్చిమ ప్రాంత జీవనాడీ ఆర్‌డిఎస్ కుడికాలువకు నిధులు కేటాయించి వెంటనే పూర్తి చేయాలని, కర్నూలు జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు బి.రామాంజనేయులు, జిల్లా కమిటీ సభ్యులు సి.గోవిందు, నాయకులు హనుమంతు, రాముడు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 19న ముఖ్యమంత్రి జగన్ ఎమ్మిగనూరుకు వస్తున్నారని, ఆయనకు సమస్యలను వివరిస్తామని తెలిపారు. ఆర్‌డిఎస్ కుడికాలువ నిర్మాణానికి నిధులు కేటాయించి పనులను చేపట్టాలని కోరారు. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా కర్నూలు జిల్లాను కరువుగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మిగనూరు టెక్స్‌టైల్ పార్కును ఏర్పాటు చేయాలని, పట్టణ ప్రజల తాగునీటి కోసం రెండో ఎస్ఎస్ ట్యాంకు ఏర్పాటు చేయాలని కోరారు. చేనేత కార్మికులు నేసిన బట్టలు అమ్మేందుకు ఎక్స్‌పోర్ట్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని తెలిపారు. గురు రాఘవేంద్ర ప్రాజెక్టు ఎత్తిపోతల పథకాన్ని కొనసాగించాలని, పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులను పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. పట్టణంలోని లెదర్ సొసైటీని పునర్ ప్రారంభించి దళితులకు ఉపాధి కల్పించాలని తెలిపారు. పట్టణంలో నిర్మించిన 5 వేల టిడ్కో గృహాలకు మౌలిక వస్తువులు కల్పించాలని డిమాండ్ చేశారు. సిపిఎం నాయకులు అబ్దుల్లా, సురేష్, రాజు, కృష్ణ పాల్గొన్నారు.

## టిడిపితోనే గ్రామాలాభివృద్ధి

**-మంత్రాయం ఇన్‌ఛార్జీ తిక్కారెడ్డి**

**ప్రజాశక్తి - కోసిగి**


సమావేశంలో మాట్లాడుతున్న తిక్కారెడ్డి

టిడిపితోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని టిడిపి మంత్రాలయం ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక 8వ వార్డులోని సిద్ధప్పపాలెంలో టిడిపి మండల కన్వీనర్ జ్ఞానేష్ అధ్యక్షతన 'బాబుతో నేను' నిర్వహించారు. మూగలదొడ్డి గ్రామంలో అనారోగ్యంతో ఉన్న టిడిపి కార్యకర్త చంద్రన్నను పరామర్శించారు. ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తిక్కారెడ్డి మాట్లాడారు. చంద్రబాబు నాయుడును అక్రమంగా అరెస్టు చేయించారని వైసిపి ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రాలయం నియోజకవర్గంలో, రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలంటే టిడిపి ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. రాబోయే రోజుల్లో టిడిపి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. టిడిపి నాయకులు వక్రాని వెంకటేశ్వర్లు, నాడిగేని అయ్యన్న, రంగడు, భరద్వాజ్ శెట్టి, మహదేవ, కొండగేని వీరారెడ్డి, మారెప్ప, వడ్డే రామయ్య, ఉమర్ పాల్గొన్నారు.

## సిఎం సభకు తరలిరండి : ఎమ్మెల్యే

**ఆదోనిరూరల్ :** మండలం నుంచి పట్టణ, గ్రామీణ ప్రజలు, వైసిపి నాయకులు, కార్యకర్తలు ఎమ్మిగనూరులో జరిగే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బహిరంగ సభకు తరలి రావాలని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్ రెడ్డి బుధవారం కోరారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు, పట్టణ ప్రజలు తరలిరావాలని కోరారు.

# మండలాభివృద్ధికి నిధులు కేటాయించాలి

**- సిపిఎం జిల్లా నాయకులు గురు శేఖర్**

**ప్రజాశక్తి - నందవరం**

నందవరం మండలాభివృద్ధికి నిధులు కేటాయించాలని సిపిఎం జిల్లా నాయకులు గురుశేఖర్ డిమాండ్ చేశారు. బుధవారం గురుశేఖర్, సిపిఎం మండల నాయకులు రంగప్ప, దేవపుత్ర, ఎల్లేష్‌లు మాట్లాడారు. తుంగభద్ర నది పక్కనే ఉన్నా తాగు, సాగునీటికి ఇబ్బంది పడడం ఇంకెన్నాళ్లు అంటూ ప్రశ్నించారు. జిల్లా పర్యటనకు ఎన్నిసార్లు వచ్చినా అభివృద్ధికి నిధులు కేటాయించడంలో జగన్మోహన్ రెడ్డి విఫలమయ్యారని విమర్శించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి 'జగనన్న చేదోడు' ఆర్థిక సహాయం నాలుగో విడత విడుదల చేసేందుకు ఎమ్మిగనూరు పట్టణానికి వస్తున్నారని తెలిపారు. వెనుకబడిన నందవరం మండలం సమస్యలపై బహిరంగ సభలో మాట్లాడాలని, నందవరం మండలాభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. ఎక్కువ గ్రామాలు తుంగభద్ర నది పక్కనే ఉన్నా స్వచ్ఛమైన తాగునీరు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తుంగభద్ర నది దగ్గర సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు ఏర్పాటు చేయడంతో పాటు నీటిని శుభ్రం చేసి ప్రజలకు ఇవ్వాలన్నారు. హాలహర్వి గ్రామంలో సీలింగ్ భూమి సమస్యను పరిష్కరించాలని, ఏ గ్రామం నుంచి ఏ గ్రామానికి వెళ్లాలన్నా రహదారులు గుంతలమయమయ్యాయని తెలిపారు. శ్మశాన వాటికలు లేని గ్రామాల్లో స్థలాలు కేటాయించాలని కోరారు. పొనకలదిన్నె నుండి కనకవీడు మీదుగా నందవరం రోడ్డు వేసి ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించాలని తెలిపారు. పాఠశాలల్లో ఖాళీ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, కస్తూరిబా, ఇంటిగ్రేటెడ్ హాస్టల్ సీట్ల సంఖ్యను పెంచాలని కోరారు. 2022లో నష్టపోయిన రైతులకు బీమా సౌకర్యం పెంచి ఎకరాకు రూ.10 వేల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నందవరంలో రైతు బజారును ఏర్పాటు చేయాలని కోరారు. నాగలదిన్నె, చిన్నకొత్తిలి నుంచి పాఠశాల, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు బస్సు లేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. సిపిఎం నాయకులు స్వామి దాసు, బి.కరుణాకర్, కనకవీడు రాజు, నాగప్ప, పెద్దయ్య, అశోక్, రాము, కొండయ్య, నాగేష్, సంతోష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిపిఎం జిల్లా నాయకులు గురు శేఖర్

## కురువ మహా గర్జనను జయప్రదం చేయండి

**- శశికళ కృష్ణమోహన్**

**ప్రజాశక్తి-ఆలూరు**


అభివాదం చేస్తున్న నాయకులు

కురువ మహా గర్జనను జయప్రదం చేయాలని బళ్లారి నగర మాజీ మేయర్ శశికళ కృష్ణమోహన్ కోరారు. బుధవారం ఆలూరు వాసవి కల్యాణ మండపంలో కురువ, మాదాసి కురువ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. బీరప్ప స్వామి దేవాలయంలో పని చేస్తున్న పూజారులకు గౌరవ వేతనం ఇవ్వాలని కోరారు. మాదాసి, మాదారి కురువ కుల ధ్రువీకరణ పత్రాన్ని ఎస్సీ సర్టిఫికెట్ ఇవ్వాలని, గురవయ్యలను కళాకారులుగా గుర్తించి పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గొర్రెలు కాపలదారులుగా పంట పొలాల్లో ఉండే వారికి బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. నియోజకవర్గంలోని మండలాల్లో కనకదాసు విగ్రహాలు ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలూ గుర్తింపు ఇవ్వాలని, ఎమ్మెల్యేలు, ఎంపీలుగా జనాభా ప్రాతిపదికన తమ వారికి పదవులు కేటాయించాలని కోరారు. జిల్లాల్లో దాదాపు 5 లక్షల ఓటర్లుగా ఉన్నామని అన్ని పార్టీలూ గుర్తించాలని తెలిపారు. డిసెంబర్ 10న కురువ మహా గర్జన నియోజకవర్గ పరిధిలో నిర్వహిస్తామని, అన్ని మండలాల నుంచి కురువలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. పారిశ్రామికవేత్త కృష్ణమోహన్, పత్తికొండ మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి రంగస్వామి, రాష్ట్ర కార్యదర్శి రామ్మోహన్, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ జయరాం, రమేష్, దేవేంద్రప్ప, నాగరాజు, హాలహర్వి మండల నాయకులు రమేష్, హొళగుంద మండల నాయకులు గజ్జప్ప, చాగప్ప, మల్లయ్య పాల్గొన్నారు.

## శారదమ్మ మృతి తీరని లోటు

**- మంత్రి గుమ్మనూరు జయరామ్**

**ప్రజాశక్తి - చిప్పగిరి**

కీర్తిశేషులు గుమ్మనూరు శారదమ్మ మృతి తమ కుటుంబానికి తీరని లోటని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ తెలిపారు. బుధవారం చిప్పగిరి మండలం గుమ్మనూరులోని మంత్రి స్వగృహంలో శారదమ్మ పెద్దకర్మ (ఉత్తర క్రియలు) నిర్వహించారు. ముందుగా కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు వారి వ్యవసాయ క్షేత్రంలోని శారదమ్మ సమాధి దగ్గరకు వెళ్లి పూజలు నిర్వహించారు. శారదమ్మ చిత్రపటానికి మంత్రి జయరామ్, కుటుంబ సభ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి జయరామ్ మాట్లాడారు. తమ తల్లి మృతి కుటుంబానికి తీరని లోటని తెలిపారు. ఆమె కుటుంబ అభివృద్ధికి ఎంతోగానో కృషి చేశారని చెప్పారు. శారదమ్మ భర్త గుమ్మనూరు బసప్ప, కుమారులు గుమ్మనూరు శ్రీనివాసులు, గుమ్మనూరు నారాయణ స్వామి, మంత్రి సోదరులు గుమ్మనూరు శ్రీనివాసులు, కర్ణాటక మంత్రి బి.నాగేంద్ర, తనయుడు, యువనేత గుమ్మనూరు ఈశ్వర్, ఆలూరు వ్యవసాయ మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు నారాయణ పాల్గొన్నారు.


చిత్రపటానికి పూలమాల నివాళులర్పిస్తున్న మంత్రి

## రైలు కిందపడి యువకుడు మృతి

**ప్రజాశక్తి - ఆదోని**

రైలు కిందపడి యువకుడు మృతి చెందిన సంఘటన ఆదోని, ఇస్వీ ఆర్ఎస్ మధ్య బుధవారం చోటుచేసుకుంది. రైల్వే స్టేషన్ ఎస్ఐ ఎం.రామస్వామి వివరాల మేరకు... మండలంలోని గణేకల్ గ్రామానికి చెందిన బడే సందీప్ (18) ఇంటర్ వరకు చదువుకున్నారు. సందీప్ మృతికి సంబంధించిన కారణాలు పోలీసు దర్యాప్తులో తెలియాల్సి ఉంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని వివరించారు.

## సమాంతర కాలువను నిర్మించండి : రైతుసంఘం

**ప్రజాశక్తి - కౌతాళం**



ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తుంగభద్ర నదిపై సమాంతర కాలువను నిర్మించాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య కోరారు. బుధవారం ఆయన మాట్లాడారు. మండలంలోని మేళిగనూర్ గ్రామం వద్ద తుంగభద్ర నది ప్రవేశిస్తుందని, ప్రతేడాది వర్షాకాలంలో లక్షల క్యూసెక్కుల వరద నీరు వృథాగా సముద్రం పాలవుతోందని తెలిపారు. ఈ జలాలను జిల్లా ప్రజలకు ఉపయోగపడేలా సమాంతర కాలువ నిర్మించాలని డిమాండ్ చేశారు. వృథా అవుతున్న తుంగభద్ర జలాలను ఉపయోగంలోకి తీసుకు రావాలంటే మేళిగనూర్ వద్ద సమాంతర కాలువ నిర్మించాలన్నారు. ఈ కాలువను మంత్రాలయం, ఆదోని, ఎమ్మిగనూరు, ఆలూరు, పత్తికొండ, కోడుమూరు, కర్నూలు, ఆత్మకూరు వరకు ఏర్పాటు చేయాలని కోరారు. ముఖ్యమైన ప్రాంతాల్లో 5 నుంచి 10 టిఎంసిలు నిల్వ చేసే చెరువులను (చిన్న, చిన్న రిజర్వాయర్లు) నిర్మించి వరద జలాలను నిల్వ చేయడం ద్వారా ఈ నియోజకవర్గాలకు తాగు, సాగునీరు అందించవచ్చని తెలిపారు. వరదజలాల నుంచి జిల్లాను సస్యశ్యామలం చేసి వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయవచ్చన్నారు. సమాంతర కాలువ కోసం విశ్రాంత ఇంజినీర్ సుబ్బరాయుడు సొంత ఖర్చులతో డిజైన్ చేసి గత ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా సమాంతర కాలువ డిజైన్ మూలన పడిందన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి ఈ కాలువ నిర్మాణం కోసం కృషి చేయాలని కోరారు.

## జర్నలిస్టుల ఉన్నతికి కృషి

**- ఎపిడబ్ల్యుజెఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శు మోహన్ రాజు, కృష్ణ**

**ప్రజాశక్తి-ఆలూరు**

ఆలూరు నియోజకవర్గ జర్నలిస్టుల ఉన్నతికి కృషి చేస్తామని ఎపిడబ్ల్యుజెఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోహన్ రాజు, కృష్ణ తెలిపారు. బుధవారం వారు మాట్లాడారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ నూతన కమిటీ ఎన్నికపట్ల ఆలూరు జర్నలిస్టుల్లో నూతనోత్సాహం వెల్లివిరిసిందని తెలిపారు. మరింత మంది జర్నలిస్టులు ఎపిడబ్ల్యుజెఎఫ్ సభ్యత్వం తీసుకుంటారని, సంఘం మరింత బలోపేతంగా ఉండేలా కృషి చేస్తామని చెప్పారు. తాలూకాలోని ఆయా మండలాల్లో ఉన్న జర్నలిస్టులకు అక్రిడిటేషన్‌తో సంబంధం లేకుండా ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరారు. జర్నలిస్టు పిల్లలకు కార్పొరేట్ పాఠశాలల్లో 100 శాతం ఫీజు రాయితీ కల్పించే విధంగా జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కుటుంబంలో అనారోగ్య సమస్యలు ఉన్న వారికి కార్పొరేట్ ఆస్పత్రిలో 50 శాతం రాయితీ కల్పించాలని తెలిపారు.




# ప్రజలందరీ ఆరోగ్యం జగనన్న లక్ష్యం

**- వైసిపి మండలాధ్యక్షులు భీమిరెడ్డి**

**ప్రజాశక్తి - మంత్రాలయం**

రాష్ట్రంలోని ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి జగన్ లక్ష్యమని వైసిపి మండలాధ్యక్షులు జి.భీమిరెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని చెట్నిహళ్లి గ్రామంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' నిర్వహించారు. భీమిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయి మాట్లాడారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు 'సురక్ష'లో పాల్గొన్నట్లు తెలిపారు. రాష్ట్రంలో విద్య, వైద్యంతో పాటు నవరత్నాలతో సంక్షేమ పథకాలను అమలు తీరును గమనించాలని సూచించారు. నాడు-నేడు కింద పాఠశాల భవనాల నిర్మాణాలు చేపట్టి కార్పొరేట్‌కు ధీటుగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. 'ఆరోగ్య సురక్ష' ద్వారా ఉచిత పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం గర్భిణులకు నిర్వహించిన సీమంతంలో పాల్గొని ఆశీర్వదించారు. అంగన్వాడీ కేంద్రాలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్‌ను పరిశీలించారు. సర్పంచి అంజినయ్య, ఎంపిటిసి రామాంజనేయులు, మాజీ సర్పంచి అల్లింగప్ప, ఎంపిడిఒ మణిమంజరి, ఇఒఆర్‌డి ప్రభావతి, అంగన్వాడీ సూపర్‌వైజర్ నాగలక్ష్మి పాల్గొన్నారు. **ఆస్పరి** మండలంలోని హాలిగేర గ్రామంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' నిర్వహించారు. సర్పంచి లింగమ్మ, స్పెషలిస్టులు గీతావాణి, గోపాలం ప్రణయ్, డాక్టర్ రఘురామ్ రెడ్డి, దుర్గాబాయి, మంజుల, అంగన్వాడీ సూపర్ వైజర్ సునీత, పంచాయతీ సెక్రటరీ చిన్న వెంకటేష్, టిడిపి మాజీ ఎంపిటిసి రామాంజినేయులు, వైసిపి నాయకులు నాయుడు పాల్గొన్నారు. **హొళగుంద** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' నిర్వహించారు. ఎంపిడిఒ సుహాసిని, తహశీల్దార్ హుస్సేన్ సాబ్, ఎంపిపి తనయుడు ఈసా, సర్పంచి తనయుడు చలవాది పంపాపతి, పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ గౌడ్, డాక్టర్ న్యూటన్ పాల్గొన్నారు.


మంత్రాలయంలో గర్భిణులను ఆశీర్వదిస్తున్న భీమిరెడ్డి


ఆస్పరిలో మాట్లాడుతున్న వైద్యులు

## సిఎం సభను జయప్రదం చేయండి : ఎమ్మెల్యే

**ప్రజాశక్తి - మంత్రాలయం**

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సభను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నవరత్నాల్లో భాగంగా 'జగనన్న చేయూత' కింద లబ్ధిదారులకు నగదు జమ చేసేందుకు ఎమ్మిగనూరు పట్టణానికి గురువారం ఉదయం 11 గంటల వస్తున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి బహిరంగ సభను వైసిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. **ఎమ్మిగనూరులో** ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రజల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాయని తెలిపారు.

**మంత్రాలయం :** ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సభను విజయవంతం చేసేందుకు వైసిపి బాధ్యులు చర్చలు జరిపారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు వైసిపి మండలాధ్యక్షులు భీమిరెడ్డి, ఇన్‌ఛార్జీ విశ్వనాథ్ రెడ్డిలు వేర్వేరుగా వైసిపి నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. 'జగనన్న చేయూత' కింద లబ్ధిదారులకు నగదు జమ చేసేందుకు ముఖ్యమంత్రి వస్తున్నారని తెలిపారు. వైస్ ఎంపిపి పులికుక్క రాఘవేంద్ర, ఉప సర్పంచి హోటల్ పరమేష్ స్వామి, ఎంపిటిసి జి.వెంకటేష్, మాజీ సర్పంచి గోర్కల్ కృష్ణస్వామి, వ్యవసాయ సలహా మండలి సభ్యులు మల్లికార్జున, కలుదేవకుంట వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షులు రఘునాథ్ రెడ్డి పాల్గొన్నారు.

## సంతాన లక్ష్మిగా మంచాలమ్మ

**ప్రజాశక్తి - మంత్రాలయం**

ప్రముఖ ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రాలయంలో గ్రామదేవత శ్రీమంచాలమ్మ, అమ్మవారు శ్రీసంతాన లక్ష్మి అవతారంలో పూజలు అందుకున్నారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం సంతాన లక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. దసరా ఉత్సవాల నేపథ్యంలో అమ్మవారిని పూలతో అలంకరించారు. శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుధేంద్ర తీర్థులు ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీరాఘవేంద్రస్వామి మూల బృందావనానికి నిత్య పూజలు చేశారు. భక్తులు ముందుగా శ్రీసంతాన లక్ష్మీ అవతారంలో ఉన్న గ్రామ దేవత శ్రీమంచాలమ్మను, శ్రీరాఘవేంద్ర స్వామి మూల బృందావనాన్ని దర్శించుకున్నారు.

# రాయలసీమ ద్రోహి జగన్ రెడ్డి

**- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ**

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు**

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాయలసీమ ద్రోహి అని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర్ రెడ్డి విమర్శించారు. బుధవారం ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. రాయలసీమ బిడ్డనని చెప్పి రాయలసీమకు న్యాయ రాజధాని చేస్తామని చెప్పి కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేస్తున్నామని ప్రగల్భాలు పలికారని గుర్తు చేశారు. హైకోర్టు ఎక్కడ జగన్మోహన్ రెడ్డి అని ప్రశ్నించారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఎమ్మిగనూరు, కర్నూలు పర్యటనకు వచ్చినప్పుడు న్యాయరాజధాని వస్తుంటే అడ్డు పడుతున్నారని నల్లజెండాలు పట్టుకొని నిరసన తెలిపిన పేటీఎం బ్యాచ్ ఎక్కడ అని నిలదీశారు. ఒకవైపు 'అప్పర్ భద్ర' ప్రాజెక్టు కట్టి రావాల్సిన నీటి వాటాను, మరోవైపు కృష్ణానది నుంచి రావాల్సిన నీటి వాటాను కొట్టేస్తుంటే వారికి వత్తాసు పలుకుతూ రాష్ట్ర ప్రజలకు అన్యాయం చేస్తున్నది ఎవరని ప్రశ్నించారు. గాజులదిన్నె ప్రాజెక్టు ఎత్తు పెంచి నీటి నిల్వలను పెంచుతామని చెప్పి నేటి వరకు ఏం చేశారని మండిపడ్డారు. టిడిపి హయాంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు జిల్లాలోని ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, కోడుమూరు, కర్నూలు నియోజకవర్గాలను సస్యశ్యామలం చేయాలని చంద్రబాబు నాయుడు ద్వారా రూ.2 వేల కోట్లతో మంజూరు చేయించిన ఆర్‌డిఎస్‌ను పూర్తి చేశారా అని ప్రశ్నించారు. నియోజకవర్గంలో చేనేతలు, నిరుద్యోగులకు లబ్ధి చేకూర్చాలని మంజూరు చేసిన టెక్స్‌టైల్స్ పార్కును పూర్తి చేశారా అని నిలదీశారు. రూ.145 కోట్లతో మంజూరు చేసిన గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి పైపులైన్ పనులను పూర్తి చేశారా అని ప్రశ్నించారు. ఎర్రబాడు గ్రామంలో ముస్లిం, మైనారిటీ ఆడబిడ్డను అత్యాచారం చేసి హత్య చేశారని, మూడేళ్లయినా ఆ కుటుంబానికి న్యాయం చేయలేదని తెలిపారు. టిడిపి హయాంలో కట్టిన జి+3 ఇళ్లను సైతం ఇంతవరకు లబ్ధిదారులకు పంపిణీ చేయలేదని తెలిపారు. పాలన చేతకాక అధికార వైఫల్యాలను ఎండగడుతున్న ప్రతిపక్షాలపై కక్ష కట్టి తప్పుడు కేసులు పెట్టి జైళ్లలో పెట్టి సైకో మాదిరి వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి పర్యటనలో నల్లజెండాలు, ఫ్ల కార్డుల రూపంలో నిరసన తెలియజేస్తామని చెప్పారు. తాము ముఖ్యమంత్రి పర్యటనకు వ్యతిరేకం కాదని, ఎమ్మిగనూరు, రాయలసీమకు చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. నాయకులు సుందర్ రాజు, దయాసాగర్, రాందాస్ గౌడ్, గురు రాజ్ దేశాయి, నారాయణరెడ్డి, తిరుపతయ్య నాయుడు, బేతాళ బడేసాహెబ్, మైనార్టీ నాయకులు తురేగల్ నజీర్ అహ్మద్, కటారి రాజేంద్ర పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీవీ

## 'ఐఎఎస్ వచ్చినా మార్పు చెందని ఆదోని'

**ప్రజాశక్తి - ఆదోని రూరల్**

ఆదోనికి ఐఎఎస్ అధికారి వస్తే అభివృద్ధి చెందుతుందని ఆశించిన ఆదోని ప్రజలకు నిరాశే మిగిలిందని ఆదోని జిల్లా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు నూర్ అహ్మద్ తెలిపారు. అక్రమ మార్పిడి జరిగిన భూముల్లో ఇళ్ల నిర్మాణాలకు అనుమతి ఇవ్వరాదని బుధవారం ఆదోనిలోని మండిగిరి పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పట్టణ శివారులోని మండిగిరి పరిధిలో ఆర్ట్స్ కళాశాల వెనుక సుమారు 5 ఎకరాల స్థలంలో 1987లో కలెక్టర్ ఆదేశాల మేరకు లే అవుట్ ప్లాట్లు వేసి రెవెన్యూ శాఖ ఉద్యోగులకు మార్కెట్ ధరకు కేటాయించారని తెలిపారు. 2019లో నిబంధనలను తుంగలో తొక్కి కేవలం ఆదోని తహశీల్దార్ స్థాయిలోనే ఇదే లే అవుట్‌ను ఇష్టానుసారంగా మార్చేశారని విమర్శించారు. ఇద్దరు మాజీ రెవెన్యూ శాఖ ఉద్యోగులు చక్రం తిప్పి ఈ ప్లాట్లను బయటి వ్యక్తులకు అమ్మడంలో ప్రధాన పాత్ర పోషించినట్లు వార్తలు వచ్చాయన్నారు. అందులో ఒకాయన ప్రస్తుతం జిల్లాస్థాయి పదవిలో ఉన్నట్లు తెలుస్తోందన్నారు. సమాచార హక్కు చట్టం కింద లే అవుట్‌ను ఎలా మార్చారని ప్రశ్నించగా ఆదోని తహశీల్దార్ కార్యాలయం వారు సమాచారం ఇవ్వలేకపోయారన్నారు. కలెక్టర్‌ను సమాచార హక్కు చట్టం ద్వారా ప్రశ్నించగా వారు ఆదోని తహశీల్దార్‌కు ఫార్వర్డ్ చేయగా, తహశీల్దార్ కార్యాలయం నుంచే సమాధానం అసంపూర్ణమేనని తెలిపారు. ఈ అక్రమ భూ వ్యవహారంపై ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించు కున్న దాఖలాలు లేవన్నారు. రెవెన్యూ కాలనీ లే అవుట్ అక్రమ మార్పునకు వ్యతిరేకంగా లోకాయుక్తలో ఫిర్యాదు చేస్తామని చెప్పారు. ఆదోని జిల్లా సమితి నాయకులు అస్లాం, నరేంద్ర కుమార్ యాదవ్, కుబేర స్వామి, నరసప్ప, గౌస్ పాల్గొన్నారు.

## 'చలో గుంటూరు'ను జయప్రదం చేయండి

**- నూర్ బాష దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం**

**ప్రజాశక్తి - కౌతాళం**

ఆంధ్రప్రదేశ్ నూర్ బాష దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'చలో గుంటూరు'ను జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు సాయిబాబా, రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్షావలీ, నబీసాబ్ కోరారు. బుధవారం కౌతాళంలో గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్రంలో 20 లక్షలకు పైగా జనాభా ఉన్న దూదేకులకు మైనార్టీ పదవుల్లో వర్గీకరణ ధామాషా ప్రకారం దూదేకులకు బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. రాజకీయ పార్టీలు చట్టసభల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. ఏ రాజకీయ పార్టీ నూర్ బాష దూదేకులకు చట్టసభల్లో అవకాశం కల్పిస్తుందో రాబోయే ఎన్నికల్లో ఆ పార్టీకి సంపూర్ణ మద్దతు ఇస్తామని ప్రకటించారు. తమ హక్కులను ఐక్యమత్యంతో పోరాడి సాధించుకోవాలని కోరారు. తమ పిల్లలను విద్యారంగంలో ప్రోత్సహించి రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. దూదేకుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మాబు సాబ్, ఆదోని తాలూకా అధ్యక్షులు మన్సూర్, సెక్రటరీ మాబు సాబ్, జిల్లా యూత్ నాయకులు టిప్పు సుల్తాన్, సంఘం నాయకులు అంగడి నబి సాబ్, దస్తగిరి, నబి సాబ్, రషీద్, పీర్ సాబ్, సిరాజ్, మరో 100 మంది పాల్గొన్నారు.


గోడపత్రికను విడుదల చేస్తున్న నాయకులు

# బాబు అక్రమ అరెస్టుకు నిరసనగా పాదయాత్ర

**ప్రజాశక్తి - చిప్పగిరి**

టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ ఆదేశాల మేరకు పాదయాత్ర నిర్వహించారు. బుధవారం చిప్పగిరి మండల కన్వీనర్ లాయర్ షేక్షావలీ ఆధ్వర్యంలో చిప్పగిరి బంబం స్వామి దర్గా నుంచి గ్రామంలోని భోగేశ్వర దేవాలయం వరకు టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాదయాత్ర చేపట్టారు. అనంతరం స్థానిక బస్టాండ్ సర్కిల్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టిడిపి కన్వీనర్ లాయర్ షేక్షావలీ, మాజీ జడ్‌పిటిసి మీనాక్షి నాయుడు మాట్లాడారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడును న్యాయంగా ఎదుర్కోలేక అక్రమ అరెస్టు చేయించి వేధిస్తున్నారని తెలిపారు. చంద్రబాబును మానసికంగా దెబ్బ కొట్టాలని ప్రభుత్వం కుట్రలు చేస్తోందని, ఈ తతంగమంతా కూడా రాష్ట్ర ప్రజలందరూ గమనిస్తున్నారని తెలిపారు. త్వరలోనే కోర్టు ద్వారా క్లీన్ చీట్ తీసుకొని బయటకు వస్తారన్నారు. టిడిపి సీనియర్ నాయకులు రఘు ప్రసాద్ రెడ్డి, బంటనహాల్ సర్పంచి సుశీలమ్మ, ఎంపిటిసి రజిని, మాజీ వైస్ ఎంపిపి వెంకటేశులు, టిడిపి మాజీ కన్వీనర్ కిష్టప్ప, పులికొండ, భాస్కర్, తిమ్మయ్య, జనార్ధన స్వామి, అంపయ్య, నరసింహులు, సురేష్, సతీష్, మేకల రామాంజిని, హరినాథ్, ఉమాపతి, నాగిరెడ్డి, అమరేష్ పాల్గొన్నారు.


చిప్పగిరి పాదయాత్రలో పాల్గొన్న టిడిపి నాయకులు

## 'ఆర్‌టిసి లాభాల్లో ఉద్యోగుల పాత్ర కీలకం'

**ప్రజాశక్తి - ఆదోని**

ఎపిఎస్ఆర్‌టిసి లాభాలు ఆర్జించడంలో ప్రతి ఉద్యోగీ పాత్ర కీలకమని డిపో మేనేజర్ మహ్మద్ రఫీక్ తెలిపారు. బుధవారం ఆదోని డిపో గ్యారేజీలో ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడారు. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో అధిక డీజిల్ ఆదా చేసిన డ్రైవర్లు వీరేష్, షరీఫ్, నాగేష్, అత్యధిక ఆదాయం ఆర్జించిన కండక్టర్లు మహేంద్రమ్మ, వీరేషప్ప, కృష్ణయ్య, హంపయ్యను నగదు బహుమతులతో సన్మానించినట్లు తెలిపారు. అలాగే ఉరుకుంద జాతరలో ఉత్తమ సేవలందించిన ఎస్‌డిఐ రామలింగప్ప, కండక్టర్లు మహేశ్వరప్ప, కార్తవ రాయుడు, పార్వతేషా, మెకానిక్ చెన్న కేశవ, అసిస్టెంట్ మెకానిక్ రమేష్‌ను అభినందించారు. ప్రతి ఉద్యోగీ వీరిని ఆదర్శంగా తీసుకొని సంస్థ లాభాల్లోకి తీసుకు రావడంలో భాగస్వాములు కావాలని కోరారు.


**మహారాజశ్రీ కర్నూలు ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో**

**ఓ.ఎస్.నెంబర్ 1307/2021**

కె.నరసింహయ్య ఆచారి. ...వాది

**(ఎదురు)**

డాక్టర్ బి.ఓంకార్ ఆచారి వగైరా. ...ప్రతివాదులు

**3వ ప్రతివాదికి దావా సమన్లు**

3) కె.యశ్వంత్ ఆచారి తండ్రి లేట్ కె.నీలకంఠ ఆచారి, ప్లాట్ నెంబర్ 746, జి.శింగవరం గ్రామము, కర్నూలు మండలం మరియు జిల్లా.

పై నెంబర్ దావాలో వాది, ప్రతివాదులు గాని ప్రతివాదులు తరపున మనుషులు గాని దావా షెడ్యూలు దాఖలా ఆస్తిలో ప్రవేశించకుండా మరియు వాది హక్కును భంగపరచకుండా పర్మినెంట్ ఇన్‌జన్‌క్షన్ ఉత్తర్వు ఇప్పించమని మరియు కోర్టు ఖర్చులు ఇప్పించమని కోరుతూ దావా దాఖలు చేసినాడు. ఇందులో 3వ ప్రతివాది అయిన నీకు ఆక్షేపణ ఉన్న 22-11-2023వ తేదీ పగలు 10:30 గంటలకు పైకోర్టులో హాజరై తెలుపుకొనవలెను. లేనియెడల నీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

**షెడ్యూలు :** House situated at G.Singavaram Village With H.No.315. Bounded by:
East : Road & Floor mill,
West : Subbarao House
North : Ediga Anjaneyulu House,
South : Telugu krishnamma House

**కోర్టు వారి ఉత్తరువు మేరకు**

**కె.గురుప్రసాద్,**
**ఎం.ఉదయ్ ప్రతాప్,**
వాదిపరం అడ్వకేట్లు, కర్నూలు.





గ్రామోత్సవంలో కైలాస వాహనంపై స్వామి అమ్మవార్లు, కూష్మాండ దుర్గ అలంకరణలో అమ్మవారు

# పేదల సొంతింటి కల సాకారం

**- మంత్రులు అంజాద్ భాష, బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, ఆదిమూలపు సురేష్**
**- ఆళ్లగడ్డ పట్టణ శివారులో టిడ్కో గృహాలు ప్రారంభం**





టిడ్కో గృహాల లబ్ధిదారులకు మెగా కీను అందజేస్తున్న మంత్రులు

**ప్రజాశక్తి - ఆళ్లగడ్డ**

ప్రతి పేదవారికి సొంత ఇళ్లు ఉండాలన్న కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిజం చేశారని ఉప ముఖ్యమంత్రి అంజాద్ భాష, ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్‌లు పేర్కొన్నారు. బుధవారం ఆళ్లగడ్డ పట్టణ శివార్లలో టిడ్కో గృహాల ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రులు అంజాద్ భాష, బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, ఆదిమూలపు సురేష్, జల వనరుల శాఖ రాష్ట్ర సలహాదారులు గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే గంగుల నాని, జిల్లా కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సామూన్, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి బుగ్గన మాట్లాడుతూ పేదవాడి కోసం ముఖ్యమంత్రి జగన్ ఎన్నో సంక్షేమ పథకాలు చేపట్టారన్నారు. గత టిడిపి ప్రభుత్వం టిడ్కో ఇళ్లను ప్రారంభించారని, వారి హయాంలో 10 శాతం అయితే మిగిలిన 90 శాతం వైసిపి ప్రభుత్వంలో పూర్తి చేశామన్నారు. గత ప్రభుత్వంలో అన్ని స్కామ్‌లేనని, వైసిపి ప్రభుత్వం వచ్చాక రివర్స్ టెండరింగ్ చేసి రాష్ట్ర ఖజానాకు వందల కోట్లు మిగిల్చామని చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును అరెస్టు చేస్తే ఇతర రాష్ట్రాల్లో, దేశాల్లో వారి అనుచరులు నిరసనలు చేశారే గాని రాష్ట్రంలో ప్రజలు ఎవరూ స్పందించలేదని ఎద్దేవా చేశారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వానికి మద్దతు పలుకుతారన్నారు. మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ సామూహిక గృహ ప్రవేశాల ప్రారంభోత్సవానికి తాను రావడం ఆనందంగా ఉందన్నారు. 23 ఎకరాల్లో టిడ్కో ఇండ్లు నిర్మించి లబ్ధిదారులకు అందజేసినట్లు చెప్పారు. ప్రస్తుతం ఈ స్థలం విలువ రూ. 100 కోట్లు ఉంటుందని తెలిపారు. ప్రజల కష్టాలను చూసి నాడు పాదయాత్రలో పేద వారందరికీ సొంతిల్లు కట్టించి ఇస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఇచ్చిన హామీని నెరవేర్చారన్నారు. రాబోయే రోజుల్లో ఈ ప్రాంతం మరో ఊరుగా అభివృద్ధి చెందుతుందని, ఇళ్లను చక్కగా చూసుకోవాలని కోరారు. పేదల ఆశలను నెరవేర్చిన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి, స్థానిక ఎమ్మెల్యే గంగుల నానికి రాబోయే ఎన్నికల్లో మద్దతు తెలపాలని కోరారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆళ్లగడ్డ పట్టణంలో 1392 గృహాలను లబ్ధిదారులకు అందజేస్తున్నట్లు తెలిపారు. దసరా, దీపావళి పండుగలు ముందే వచ్చినట్లుగా ఇక్కడి వాతావరణం కనిపిస్తుందన్నారు. ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి మాట్లాడుతూ పేదవాడి సొంతంటి కలను నెరవేర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను అందరూ గుర్తు పెట్టుకోవాలన్నారు.

ఈ కార్యక్రమంలో విజయ డైరీ చైర్మన్ ఎస్వి జగన్మోహన్ రెడ్డి, రామతీర్థం పుట్టాలమ్మ ఆలయ చైర్మన్ గంగుల మనోహర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ రామలింగారెడ్డి, కమిషనర్ రమేష్ బాబు, టిడ్కో ఎస్ఇ రాజశేఖర్, రామసుబ్బయ్య, రాష్ట్ర ముస్లిం మైనార్టీ జనరల్ సెక్రటరీ బాబులాల్, మార్కెట్ యార్డ్ చైర్మన్ గంధం రాఘవ రెడ్డి, ఇరిగేషన్ చైర్మన్ కర్రా గిరజా హర్షవర్ధన్ రెడ్డి, గంగుల విజయసింహారెడ్డి, తహశీల్దార్ హరినాథ్ రావు, ఎంపిపిలు గజ్జల రాఘవేంద్ర రెడ్డి, వీరభద్రుడు, కౌన్సిలర్ గొట్లూరు సుధాకర్ రెడ్డి, యాదవాడ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కూష్మాండ దుర్గ అలంకారంలో అమ్మవారు

**- కైలాస వాహనంపై స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం**

**ప్రజాశక్తి - శ్రీశైలం**

శ్రీశైలం క్షేత్రంలో జరుగుతున్న దసరా మహోత్సవాల్లో నాల్గవ రోజు బుధవారం భ్రమరాంబ దేవి అమ్మవారు కూష్మాండదుర్గ అలంకారంలో, కైలాస వాహనంపై స్వామి అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు. అంతకు ముందు అమ్మవారికి శ్రీచక్రార్చన, నవావరణార్చన, విశేష కుంకుమార్చనలు, రుద్రహోమం, చండీ హోమం, చతుర్వేద పారాయణలు, రుద్ర పారాయణ, చండీపారాయణ, జపానుష్ఠానాలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అలంకార మండపంలో అమ్మవారి ఉత్సవమూర్తిని కూష్మాండదుర్గ అలంకారంలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కైలాసవాహనంపై స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఏర్పాటుచేసి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కూష్మాండ దుర్గ అలంకారంలో ఉన్న అమ్మవారిని, కైలాస వాహనంపై ఉన్న స్వామి అమ్మవార్లను ఆలయ రాజగోపురం గుండా ప్రధాన వీధుల్లోకి తీసుకువచ్చి రథశాల వద్ద నుండి నంది గుడి, బయలు వీరభద్ర స్వామి వరకు గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ గ్రామోత్సవంలో వివిధ రకాల నృత్య ప్రదర్శనలు, కోలాటం, చెక్కభజన, తప్పెట చిందు వంటి కళా నృత్య ప్రదర్శనలు, వేదమంత్రాలు మధ్య గ్రామోత్సవాన్ని చేపట్టారు.

**కుమారి పూజ :** దసరా మహోత్సవాల్లో సాంప్రదాయ బద్ధంగా కుమారి పూజ నిర్వహించారు. ఇందులో 2 సంవత్సరాల నుండి 10 సంవత్సరాల లోపు బాలికలకు పూలు, పండ్లు, నూతన వస్త్రములు సమర్పించి ప్రత్యేక పూజలు వారికి నిర్వహించారు.

## పాణ్యంలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలి

**- రైల్వే డిఆర్‌ఎంకు ఎమ్మెల్యే కాటసాని విన్నపం**

**ప్రజాశక్తి - పాణ్యం**

పాణ్యం రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళు ఆగేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి దక్షిణ మధ్య రైల్వే డిఆర్‌ఎం మనీష్ అగర్వాల్‌ను కోరారు. బుధవారం పాణ్యం రైల్వే స్టేషన్‌ను దక్షిణ మధ్య రైల్వే డిఆర్‌ఎం మనీష్ అగర్వాల్ తనిఖీ చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి రైల్వేస్టేషన్ వద్దకు చేరుకొని పాణ్యం, నెరవాడ, కౌలూర్ గ్రామాల్లో నెలకొన్న రైల్వే అండర్ బ్రిడ్జి సమస్యలను పరిష్కరించాలని కోరారు. పాణ్యం రైల్వే స్టేషన్ మీదుగా 8:30కి వెళ్లే అమరావతి ఎక్స్‌ప్రెస్ ఆగేలా చూడాలన్నారు. అలాగే హుబ్లీ - విజయవాడ, గుంటూరు –కాచిగూడ, కాచిగూడ– గుంటూరు తదితర ఎక్స్‌ప్రెస్ రైళ్ళను ఆపాలని కోరారు. నెరవాడ రైల్వే అండర్ బ్రిడ్జి సమస్యను త్వరగా పరిష్కరించాలన్నారు. పాణ్యం రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో అనేక పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రదేశాలు, సోలార్ పరిశ్రమలు ఉన్నాయని చెప్పారు. ప్రజల రాకపోకలకు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వారికి భక్తులు ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే పాణ్యం రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలబడేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాణ్యం రైల్వే స్టేషన్లో రిజర్వేషన్ కౌంటర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఎమ్మెల్యే విన్నపానికి సానుకూలంగా స్పందించిన డిఆర్‌ఎం త్వరలోనే నిర్ణయం తీసుకొని ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలబడేలా చూస్తామన్నారు. రైల్వే అండర్ బ్రిడ్జి సమస్యను త్వరగా పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి సూర్యనారాయణ రెడ్డి, వైసిపి మండల అధ్యక్షుడు కరుణాకర్ రెడ్డి, రైల్వే సిబ్బంది పాల్గొన్నారు.



రైల్వే డిఆర్‌ఎంకు సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

## ముగిసిన రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలు

**- విజేతలకు బహుమతులు ప్రదానం**

**ప్రజాశక్తి - ఆళ్లగడ్డ**

పట్టణంలోని వైపిపిఎం జూనియర్ కళాశాల ఆవరణంలో గత మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలు బుధవారం ముగిశాయి. సాఫ్ట్ బాల్ పోటీలలో ప్రతిభ కనబరిచిన వారికి ముఖ్య అతిథులు నంద్యాల జిల్లా యోగాసన అసోసియేషన్ చైర్మన్ ఆవుల విజయభాస్కర్ రెడ్డి, అనంత విద్యా సంస్థల అధినేత అనంత రామసుబ్బారెడ్డి, జాయింట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, రాష్ట్ర సాఫ్ట్ బాల్ అసోసియేషన్ సెక్రటరీ నాగేంద్ర, కర్నూల్ ఉమ్మడి జిల్లాల సాఫ్ట్ బాల్ సెక్రటరీ విజయ్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాసరెడ్డి, డిఎస్‌డిఒ రాజులు బహుమతులు ప్రదానం చేశారు. పురుషుల విభాగంలో మొదటి బహుమతి గుంటూరు జిల్లా, రెండవ బహుమతి కర్నూల్, మూడో బహుమతి విజయనగరం జిల్లా వారు సాధించారు. బాలికల విభాగంలో మొదటి బహుమతి విజయనగరం, రెండవ బహుమతి అనంతపురం, మూడో బహుమతి కడప జిల్లా వారు గెలుచుకున్నారు. కార్యక్రమంలో నరసింహా, దేవేంద్ర, బాబు, ప్రతాప్, ఓబన్న, నాగేంద్ర, ప్రతాపుడు, దస్తగిరి, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.





విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ముఖ్య అతిథులు





ఎన్నికైన జిల్లా వ్యవసాయ అధికారుల సంఘం నూతన కార్యవర్గం

## వ్యవసాయ అధికారుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

**- జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా బి.ఆంజనేయ, జి.జయప్రకాశ్ రెడ్డి**

**ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్**

నంద్యాల జిల్లా వ్యవసాయ అధికారుల సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. రాష్ట్ర వ్యవసాయ అధికారుల సంఘం అధ్యక్షులు బాల భాస్కర్, కార్యదర్శి ప్రవీణ్, కోశాధికారి మురళి, జోనల్ ఉపాధ్యక్షులు రామాంజనేయ రెడ్డి, ఉమ్మడి కర్నూల్ జిల్లా అధ్యక్షులు విశ్వనాథ్, కార్యదర్శి దస్తగిరి రెడ్డి, కోశాధికారి రామకృష్ణల ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా వ్యవసాయ అధికారి టి మోహన్ రావు సమక్షంలో నంద్యాల జిల్లా సర్వసభ్య సమావేశము నిర్వహించారు. అనంతరం జిల్లా నూతన వ్యవసాయ అధికారుల కార్యవర్గ సంఘం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా ఆత్మకూరు సహాయ వ్యవసాయ సంచాలకులు బి.ఆంజనేయ, జిల్లా ప్రధాన కార్యదర్శిగా పాణ్యం వ్యవసాయ అధికారి జయ ప్రకాష్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా జిల్లా వనరుల కేంద్రం ఏవో పి.ప్రభావతమ్మ, సహాయ కార్యదర్శిగా ఏవో అయూబ్ బాషా, జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయం కోశాధికారిగా ఏవో కె.కళ్యాణ్ కుమార్ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన జిల్లా వ్యవసాయ అధికారుల సంఘం నాయకులకు వ్యవసాయ శాఖ సిబ్బంది, అధికారులు అభినందనలు తెలియజేశారు.



ముస్లిం మైనార్టీ నాయకుని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీసీ రాజారెడ్డి

## ముస్లిం మైనార్టీ నాయకుడు మృతి

**- నివాళులర్పించిన మాజీ సర్పంచి బిసి రాజారెడ్డి**

**ప్రజాశక్తి - బనగానపల్లె**

పట్టణానికి చెందిన ముస్లిం మైనార్టీ నాయకులు మహమ్మద్ బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న పట్టణ మాజీ సర్పంచి బిసి రాజా రెడ్డి ఆయన భౌతికయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## రెడ్డిపల్లెలో సిసి రోడ్డు నిర్మాణం

**ప్రజాశక్తి - రుద్రవరం**

రుద్రవరం మేజర్ పంచాయతీ పరిధిలోని రెడ్డిపల్లి గ్రామంలో రూ. 17.50 లక్షలు గడపగడప నిధులతో సిసి రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు సర్పంచ్ బైరి విజయలక్ష్మి, వైసిపి నాయకుడు బైరి బ్రహ్మం తెలిపారు. బుధవారం సిసి రోడ్డు పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి సహకారంతో గడపగడపకు నిధులను కేటాయించి గ్రామంలోని ప్రధాన రహదారిలో ఎన్నో సంవత్సరాల నుంచి గుంతల మయంగా ఉన్న రోడ్డును 140 మీటర్ల పొడవున సిసి రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తి అయితే తువ్వపల్లి తిప్పపై ఉన్న మోడల్ స్కూల్, విద్యుత్ సబ్ స్టేషన్‌కు వెళ్లే సిబ్బంది, విద్యార్థులకు వెళ్లడానికి ఇబ్బంది లేకుండా సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. వాహనాలకు కూడా ఎలాంటి ఇబ్బందులు ఉండవని చెప్పారు. రోడ్డు నిర్మాణం జరుగుతున్న కారణంగా తువ్వపల్లి నుంచి రెడ్డిపల్లి మీదుగా ప్రాంతాలకు వెళ్లే గ్రామస్తులు, అలాగే రెడ్డిపల్లె గ్రామ ప్రజలు సహకరించాలని కోరారు.



రోడ్డు పనులు చేయిస్తున్న వైసిపి నాయకుడు బైరి బ్రహ్మం

## ప్రభుత్వ సేవలు మరింత వేగం

**- ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి**

**ప్రజాశక్తి - బేతంచెర్ల**

బేతంచెర్ల పట్టణంలో 5వ సచివాలయం అందుబాటులోకి రావడంతో సంబంధిత వార్డు ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత వేగంగా అందుతాయని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. బుధవారం బేతంచెర్ల పట్టణంలో రూ.40 లక్షలతో నిర్మించిన 5వ సచివాలయాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం స్థానిక ప్రజలతో మంత్రి బుగ్గన మాట్లాడారు. వీధుల్లో ఆయన పర్యటించారు. ఇంకా ఏవైనా సమస్యలు, ఇబ్బందులు ఉన్నాయా అంటూ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు బేతంచెర్ల క్యాంప్ కార్యాలయం నుంచి పాదయాత్రగా బయలుదేరి ప్రజలను పలకరిస్తూ స్థానిక ఆలయాలను దర్శించుకున్నారు. అమ్మవారి శాల, అయ్యప్ప, ఆంజనేయ, చెన్నకేశవ, మాధవ ఆలయాలలో పూజా కార్యక్రమాలలో మంత్రి పాల్గొన్నారు. వేద పండితులు ఆలయమర్యాదలతో మంత్రి బుగ్గనను పట్టువస్త్రంతో సత్కరించి, ప్రసాదం అందజేశారు. ఆ తర్వాత రూ.3.70 కోట్లతో జరుగుతున్న కందకం డ్రెయినేజీ కాలువ అభివృద్ధి పనులను మంత్రి పరిశీలించారు. బేతంచెర్ల పట్టణానికి కీలకమైన ఈ పనులను వేగంగా నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. బేతంచెర్ల ఊరి వాకిలి అభివృద్ధికి చొరవ తీసుకోవాలని మున్సిపల్ ఛైర్మన్ సిహెచ్ చలం రెడ్డిని ఆదేశించారు. కందకం పక్కన కోటి లచ్చుమ్మ ఆలయానికి స్థలం కేటాయించాలని స్థానిక మహిళలు మంత్రికి విజ్ఞప్తి చేశారు. కందకం పూర్తి తర్వాత దృష్టి సారిద్దామని సానుకూలంగా స్పందించారు. అనంతరం బేతంచెర్ల మార్కెట్ యార్డు అభివృద్ధి పనులను పరిశీలించారు. రూ.60 లక్షలతో నిర్మిస్తోన్న మార్కెట్ యార్డ్ మౌలిక సదుపాయాలపై కాంట్రాక్టర్‌కు పలు ఆదేశాలిచ్చారు. అంతకుముందు బేతంచెర్లలోని వైసిపి కార్యాలయంలో గోరుగుట్ట ఆటో యూనియన్ డ్రైవర్లు మంత్రిని కలిశారు. వాహనమిత్ర అందించడం పట్ల ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బేతంచెర్ల మున్సిపల్ ఛైర్మన్ సిహెచ్ చలం రెడ్డి, మద్దిలేటి స్వామి ఆలయ ఛైర్మన్ రామచంద్రుడు, వైసిపి నాయకులు బాబు రెడ్డి, ఆర్యవైశ్య సంఘ నాయకులు, ఎమ్మార్వో నరేంద్రనాథ్ రెడ్డి, పట్టణ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి బుగ్గన

## గ్రాస్ ఎన్రోల్మెంట్ సర్వేను పూర్తి చేయాలి : కలెక్టర్

**ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్**

ఓపెన్ స్కూల్లో పెండింగ్ వున్న గ్రాస్ ఎన్రోల్మెంట్ సర్వేను వెంటనే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో నాడు–నేడు పనుల ఎక్స్పెండిచర్ బుకింగ్, గ్రాస్ ఎన్రోల్మెంట్ సర్వేపై కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రెండవ విడత నాడు నేడు కింద పనులు చేపట్టి 62 ప్రభుత్వ పాఠశాలల్లో ఖర్చు చేయని మొత్తాలకు ఎక్స్పెండిచర్ బుక్ చేయాలని ఎంఈఓ, సంబంధిత ఇంజినీర్లను ఆదేశించారు. ప్రతి మండలంలో ఖచ్చితంగా 4 పాఠశాలల్లో అన్ని పనులు పూర్తిస్థాయిలో పూర్తి చేసి ఈ నెలాఖరులోపు విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. పనుల ప్రగతిపై ప్రతి రోజు డిఇ, ఎఇలు పర్యవేక్షించి నివేదికలు ఇవ్వాలని సూచించారు. నిధులకు కొరత లేదని, పనులు నాణ్యతతో చేపట్టి పూర్తయిన పనులకు ఎప్పటికప్పుడు ఎక్స్పెండిచర్ బుక్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. స్లాబ్ పెండింగ్ ఉన్న 99 అంగన్వాడీ కేంద్రాలలో ఈ నెలాఖరులోపు స్లాబ్ పడేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో డిఇఓత సుధాకర్ రెడ్డి, సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారి లలిత, పంచాయతీ రాజ్ ఎస్ఇ రామ్మోహన్, డిఇ, ఎఇలు, ఎంఇఓలు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ గెలుపు దేశానికి అవసరం : చింతల మోహన్ రావు

**ప్రజాశక్తి - నంద్యాల**

కాంగ్రెస్ పార్టీ గెలుపు దేశానికి ఎంతో అవసరమని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ చింతల మోహన్ రావు పేర్కొన్నారు. బుధవారం నంద్యాల పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం రాజీవ్ గాంధీ భవన్‌లో పట్టణ అధ్యక్షులు దాసరి చింతలయ్య ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన కార్యవర్గంలో రెండవసారి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తనకు అవకాశం ఇచ్చిన పార్టీ పెద్దలకు ధన్యవాదాలు తెలియజేస్తున్నానని అన్నారు. ఈసారి రాబోయే ఎలక్షన్లలో ప్రాంతీయ పార్టీలు ఏవైతే ఉన్నాయో ఎలా అయితే మనకు ఇక్కడ బీజేపీ అంటే బి బాబు జె జగన్ పి పవన్ కళ్యాణ్ ఈ ముగ్గురు బిజెపి కొరకు పోటీపడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని మరిచిపోయిన సంగతి మనందరికీ తెలుసన్నారు. దేశంలో ప్రేమపూర్వకంగా నడిపించే పార్టీ ఈ దేశానికి అవసరమని భారత్ జోడో యాత్ర ద్వారా భరోసా కల్పించారని చెప్పారు. ఎన్నికలు జరిగే ఐదు రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి మస్తాన్ ఖాన్, జిల్లా ఉపాధ్యక్షుడు ఆనంద్ రావు, జిల్లా మైనారిటీ సీనియర్ నాయకుడు చాబోలు సలాం, యూత్ కాంగ్రెస్ నాయకులు పసుపుల అజయ్ కుమార్, జావిద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చింతల మోహనరావు

## 'ఉజ్వల'ను పకడ్బందీగా అమలు చేయాలి : జెసి

**ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్**

ప్రధాన మంత్రి ఉజ్వల పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.రాహుల్ కుమార్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా గ్యాస్ పంపిణీపై జిల్లా ఉజ్వల కమిటీ సమావేశం నిర్వహించారు. ఉచిత కనెక్షన్ల జారీకి సంసిద్ధతపై జాయింట్ కలెక్టర్ భారత్ పెట్రోలియం కార్పొరేషన్, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఏరియా సేల్స్ అధికారులతో సమీక్షించారు. కనెక్షన్ల జారీకి సంసిద్ధతపై ఏరియా సేల్స్ అధికారులు తాము పూర్తి సంసిద్ధంగా ఉన్నామని, ఈకేవైసీ ప్రక్రియ కూడా మొదలుపెట్టామని తెలిపారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి యన్. వెంకటరాముడు, సహాయ పౌరసరఫరాల అధికారి జె.రవిబాబు, నంద్యాల్ జిల్లా నోడల్ అధికారి, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సేల్స్ ఆఫీసర్ యశ్వంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేస్తున్న జడ్పిటిసి చల్లా శ్రీలక్ష్మి

## ఘనంగా చల్లా శ్రీ లక్ష్మీ పుట్టినరోజు వేడుకలు

**ప్రజాశక్తి - అవుకు :** అవుకు మండల జడ్పిటిసి చల్లా శ్రీలక్ష్మి పుట్టినరోజు వేడుకలు అవుకు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఘనంగా జరిగాయి. కోవెలకుంట్ల, సంజామల, కొలిమిగుండ్ల మండలాల నుంచి అభిమానులు తరలివచ్చి జడ్పిటిసి చల్లా శ్రీలక్ష్మికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆమె అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేశారు. దివంగత ఎమ్మెల్సీ చల్లా భగీరథరెడ్డి అభిమానం మేరకు అభిమానులు తరలివచ్చి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలపటం చాలా ఆనందమని ఆమె హర్షం వ్యక్తం చేశారు.

## గిఫ్ట్ స్కీమ్ లక్కీడ్రా విజేతలు ప్రకటన

**ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ :** నంద్యాల నుండి రుద్రవరంకు ఆర్టిసి బస్సుల్లో వెళ్లే ప్రయాణికులకు ఏర్పాటు చేసిన గిఫ్ట్ స్కీమ్ లక్కీ డ్రా బహుమతులను ఆర్టిసి డిపో మేనేజర్ గంగాధర్ రావు బుధవారం నంద్యాల డిపోలో ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 1 నుండి 15 వరకు బస్సులో వేసిన టికెట్లలో మొదటి బహుమతిని రుద్రవరం గ్రామం పి.కళావతి, సెల్ 9642530444, రెండవ బహుమతిని రుద్రవరం గ్రామం వి. శ్రీనివాసులు, సెల్ 9618818442, మూడవ బహుమతిని అయ్యలూరు గ్రామం నరేంద్ర, సెల్ 9390590483 గెలుచుకున్నారని చెప్పారు. వీరు బహుమతులను డిపోలో అసిస్టెంట్ మేనేజరు (ట్రాఫిక్) వద్ద తీసుకోవాలని కోరారు.

## ఎలుగుబంటి దాడిలో వ్యక్తికి తీవ్ర గాయాలు

**ప్రజాశకి - రుద్రవరం :** ఎలుగుబంటి దాడిలో మండలంలోని హరినగరం గ్రామానికి చెందిన శీలం శివ తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. హరినగరం గ్రామానికి చెందిన శీలం శివ నల్లమల ప్రాంతంలో ఉన్న గండ్లేరు వాగు రిజర్వాయర్‌లో చేపలు పట్టేందుకు మరో నలుగురు వ్యక్తులతో కలిసి వెళ్లాడు. చేపల వేట ముగించుకొని ఇంటికి తిరిగి వస్తున్న సమయంలో దారిలో ఎలుగు బంటి దాడి చేసింది. వెంట ఉన్న వారు కేకలు వేయడంతో ఎలుగు బంటి పారిపోయింది. తీవ్రంగా గాయపడిన శివను చికిత్స నిమిత్తం ఆళ్లగడ్డలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## యువకుడు అదృశ్యం

**ప్రజాశక్తి - రుద్రవరం :** మండలంలోని కోటకొండ గ్రామానికి చెందిన గోన దుర్గ ప్రసాద్(22) అదృశ్యమైనట్టు ఎస్సై శరత్ కుమార్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు కుమారుడు దుర్గాప్రసాద్ నంద్యాలలోని సూర్య స్టోర్స్‌లో పని చేసేవాడని, రోజు మాదిరిగానే డ్యూటీకి వెళుతున్నాను అని ఇంటిదగ్గర చెప్పి కనిపించకుండా పోయాడన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

